క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్‌లోని వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నరాములు, గ్రామపుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం మెరుగు



విజయం సాధించిన టీం సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, రేసింగ్ ఎహెడ్ డైరెక్టర్ శ్రీనివాస్‌లు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులకు వివిధ రకాల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో క్రీడలపై అవగాహన పెరగడంతో పాటు కాలనీవాసుల మధ్య మరింత స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందన్నారు. పోటీల్లో వివాంటిస్ స్ట్రైకర్స్ విజయం సాధించగా మేఫేర్ ముస్టాంగ్స్ రన్నర్స్‌గా నిలిచారు.

బాధితునికి అండగా ఉంటాం

ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి



బాధితుడిని పరామర్శిస్తున్న భిక్షపతి

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని గొంగ్లూర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన భూవివాదంలో గాయపడిన బాధితుడిని రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి సోమవారం పరామర్శించారు. గొంగ్లూర్‌లో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి భూమి కొనుగోలు చేస్తున్నాడు. ఇతని అనుచరులతో జరిగిన వివాదంలో గ్రామానికి చెందిన పల్లె క్రాంతికి గాయాలయ్యాయి. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించాడు. కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, ఎస్సీ మానిటరింగ్ సభ్యుడు ఇమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు నగేష్ గౌడ్ బ్రహ్మారెడ్డి, అశోక్, వీరోట్టి పాల్గొన్నారు.

మురికి నీటిని దారి మళ్లించండి



కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: మురికినీరు పొలంబాటలోకి వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మురికి నీటిని దారి మళ్లించాలని దిడ్గి గ్రామానికి చెందిన పలువురు రైతులు పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. దిడ్గి, కోత్తూర్(బి) గ్రామాలు పక్కపక్కనే ఉన్నాయి. కోత్తూర్(బి) గ్రామానికి చెందిన మురికినీరు దిడ్గి శివారులోని పంట పొలాల బాటలోకి వస్తుందన్నారు. నీరు రావడం వల్ల రోడ్డు బురదగా మారి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాపోయారు. చెరకు, ఇతర పంటలు పొలం బయటకు తీసుకొచ్చే పరిస్థితి లేదన్నారు. కావున మురికి నీరు పొలం బాటలోకి రాకుండా చర్యలు తీసుకొని దారి మళ్లించాలని కోరారు.

న్యాయవాద పట్టా పొందిన ఆయేషా



ఆయేషా సిద్ధిఖా

సంగారెడ్డి: పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాసిం కుమార్తె ఆయేషా సిద్ధిఖా శనివారం విడుదలైన ఆలిండియా బార్ పరీక్షలో పాసైయింది. ఉస్మానియా యూనివర్సిటీ అనంత న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ చేసి తెలంగాణ బార్ కౌన్సిల్‌లో నమోదు కావడంతో తోటి న్యాయవాదులు, బంధుమిత్రులు అభినందించారు.

ప్రసవాలకు 17వ తారీఖు!

ఒకే రోజు నాలుగైదు డెలవరీలు

- న్యాల్‌కల్ పీహెచ్‌సీకి కలిసొస్తున్న 17వ తేదీ



పుట్టిన బిడ్డలతో కుటుంబ సభ్యులు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు ఒకటి రెండు ప్రసవాలు జరుగుతాయి. న్యాల్‌కల్ పీహెచ్‌సీలో మాత్రం ఒక్క రోజు నాలుగు, ఐదు ప్రసవాలు జరుగుతున్నాయి. అవి కూడా సాధారణ ప్రసవాలు కావడం గమనార్హం. ఇదీ సాధారణం అనుకుంటే 17వ తారీఖున మాత్రమే నాలుగైదు ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతో న్యాల్‌కల్ పీహెచ్‌సీ 17 తారీఖు కలిసొస్తుందా? అని ఇటు వైద్య సిబ్బంది అటు ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య లక్ష్యానికి మించి జరుగుతున్నాయి. డిసెంబర్ 17న న్యాల్‌కల్ పీహెచ్‌సీల్లో 17 గంటల్లో ఐదు ప్రసవాలు జరుగగా, జనవరి 17న 24 గంటల్లో 5 ప్రసవాలు జరిగాయి. తాజాగా ఈనెల 17న మరో నాలుగు ప్రసవాలు జరిగినట్లు వైద్యులు తెలిపారు. మల్గికి చెందిన శిలమ్మ, రాఘవాపూర్‌కు చెందిన మౌనిక, మిర్జాపూర్(ఎన్)కు చెందిన సబా మగబిడ్డకు జన్మనివ్వగా, చినిగెపల్లికి చెందిన ఫరీదా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇలా 17న ఒకే రోజు నాలుగు, ఐదు ప్రసవాలు జరగడం, అవి కూడా సాధారణ ప్రసవాలు జరగడంపై వైద్య సిబ్బంది, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



న్యాల్‌కల్ పీహెచ్‌సీ

స్వాగత తోరణం ప్రారంభం



ఆలయ స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వందనా పురికాలనీలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయం స్వాగత తోరణాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సొంత నిధులతో ఆలయ ముఖద్వారం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, ప్రమోద్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా కొనుగోళ్లు చేస్తే చర్యలు

ఏఎంసీ కార్యదర్శి సునీల్‌కుమార్



దుకాణ యజమానికి నోటీసులు ఇస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): లైసెన్సులు లేకుండా పంటల కొనుగోళ్లు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని వట్‌పల్లి ఏఎంసీ కార్యదర్శి సునీల్‌కుమార్ అన్నారు. ఇటీవల మండలంలోని దరఖాస్తుపల్లిలో పత్తి తూకంలో వ్యాపారి మోసం బయటపడిన విషయం తెలిసిందే. ఈ విషయమై మార్కెట్ కమిటీ ఆదేశాల మేరకు అధికారులు సోమవారం వట్‌పల్లిలో ఖరీదు లైసెన్స్ లేకుండా వ్యాపారం సాగిస్తున్న హెచ్‌కే ట్రేడర్స్ యాజమాని బగిలి హసన్ పాషాకు నోటీసులు అందజేసి దుకాణంలో ఉన్న సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని విక్రయించే సమయంలో లైసెన్స్ కలిగిన వ్యక్తులకు మాత్రమే విక్రయించాలని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. వ్యాపారులు పంటలను తూకం వేసే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఎంసీ సూపర్‌వైజర్ పండరీనాథ్, సిబ్బంది నర్సిం, తదితరులు ఉన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం



ఇఫ్తార్‌లో పాల్గొని ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రంజాన్ పవిత్రమాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖవక్త, బ్రదర్ షఫీ పరమత సహనంపై ప్రత్యేకంగా బోధనలు చేశారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని.. కష్టనష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి అనిల్‌కుమార్, నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న నగేష్‌షెట్కార్

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలానికి చెందిన కుషాల్‌రావుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 వేల చెక్కు మంజూరయింది. సోమవారం ఎంపీ సురేష్ షెట్కార్ నివాసంలో జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ చెక్కు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాణిక్‌రావు, మాజీ కౌన్సిలర్ వివేకానంద్, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిలు, సురేష్, సంతోష్‌పటేల్, పాండు, బుచ్చిరెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని ఎర్రారం, బ్రహ్మణపల్లి, కొండరెడ్డిపల్లి, చందంపేట్, కిచ్చన్నపల్లి, నేరడిగుంట గ్రామాల్లో14వ విడత జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ పనుల్లో చేసిన కూలీల పేర్లు హాజరు పట్టిక, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సోంనారాయణ, కార్యదర్శి నర్సింహాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: ఇంటి పన్ను, వృత్తి, వ్యాపార లైసెన్సు, నల్లా బిల్లులు వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటిపన్నులు సకాలంలో చెల్లించనివారిపై మున్సిపల్ చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా లేదా మున్సిపల్ సిబ్బందికి చెల్లించవచ్చన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

జహీరాబాద్ టౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది ఏజాజ్ పాషపై దాడిని ఖండిస్తూ సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి డీఎస్పీ కార్యాలయం ర్యాలీగా వెళ్లారు. డీఎస్పీ రాంమోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు శ్రీనివాస్‌ఖన్న, సంగప్ప పాటిల్, పాండురంగారెడ్డి, జుబేర్, అశోక్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిక

మునిపల్లి(అందోల్): ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఏమయ్యాయని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రశ్నించారు. సోమవారం మండలంలోని మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ క్యాంపు ఆఫీస్‌లో వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం ప్రజలకు, రైతులకు సంక్షేమ పథకాలు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకాలు మంజూరు ఆగిపోయాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ నూతన కమిషనర్ జైత్రంనాయక్‌ను గ్రామస్తులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మండల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ కమిషనర్ దృష్టికి పలు సమస్యలు తెచ్చారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయని, వీధిలైట్లు పనిచేయడం లేదని తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య నెలకొందని వివరించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కార్తీక్, కరుణాకర్ గౌడ్, రాములు, బాబు, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమనీయం.. వీరభద్రుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి దంపతులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం వీరభద్ర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని పురోహితుల వేదమంత్రాల మధ్యన భక్తిశ్రద్ధలతో జరిపించారు. భద్రకాళి సమేత వీరభద్రుడు భక్తజన సమక్షంలో అమ్మవారిని వివాహమాడారు. ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భద్రకాళి సమేత వీరభద్రస్వామిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘వాసవీ మాఇల్లు’ సేవలు అభినందనీయం

కలెక్టర్ వల్లూరు క్రాంతి



మంచి నీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న క్రాంతి

సంగారెడ్డి: వేసవిలో ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించడం అభినందనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. వాసవీ మా ఇల్లు ఆధ్వర్యంలో పట్టణంలో వందరోజుల పాటు ఉచితంగా మంచి నీటి సరఫరా చేసే మంచినీటి ట్యాంకర్‌ను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సంగారెడ్డిలో ప్రజలకు ఉచితంగా తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. ఈ సంవత్సరం సదాశివపేట పట్టణ ప్రజలకు కూడా మంచినీరు అందించాలని నిర్ణయించడం శుభపరిణామమని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ.. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో జూన్ 25వ తేదీ వరకు 100 రోజుల పాటు ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈఈ ఇంతియాజ్ అహ్మద్, సంస్థ సభ్యులు సుధాకర్, శ్రీహరి, మధు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్ నాయక్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రామచందర్‌నాయక్

కంది(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని చేర్యాలలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.45 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ రోడ్డు ఏర్పాటుతో బీసీకాలని వాసుల అవస్థలు తీరుతాయన్నారు. మంజూరైన నిధులతో అవసరం ఉన్న చోట అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న చుక్కా రాములు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేక రిలే నిరాహార దీక్షలు 48వ రోజుకు చేరాయి. అనంతరం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సోమవారం 300 మందితో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించకుండా ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రైతులు, ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని నిర్ణయం తీసుకోవాన్నారు. లేనియెడల రానున్న రోజుల్లో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక కోర్టు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు తాత్కాలిక భవన మరమ్మతులు పనులను సంగారెడ్డి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రానికి కోర్టు మంజూరయింది. ప్రస్తుతం తాత్కాలిక భవనం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మండల కేంద్రంలో నూతన కోర్టు పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. మండలానికి కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, స్థానిక ప్రజలు కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, అడ్వకేట్లు శ్రీనివాస్‌గౌడ్, ప్రకాష్, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలకిషన్, మధుశ్రీ, నాగరాజు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మహిళలకు మగ్గంవర్క్‌లో శిక్షణ

సంగారెడ్డి రూరల్: గ్రామీణ మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నెలరోజుల పాటు ఇచ్చే శిక్షణకు రేషన్‌కార్డ్ జిరాక్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, నాలుగు ఫొటోస్ కావాలన్నారు.

◆ కొనసాగిన సప్తాహ

నారాయణఖేడ్: చాప్టా(కె)లోని హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం నాలుగోవ రోజు సోమవారం కొనసాగింది. కీర్తన, భజన, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రేయారెడ్డి, సంగప్ప, అనంత రెడ్డి, సిద్దన్న, పీరన్న, అనిల్ తదితరులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు, కీర్తనకారులతో కలిసి భజనలు చేశారు.

◆ ఎర్రరాయి ట్రాక్టర్ సీజ్

న్యాల్‌కల్(జహీరాబాద్): అనుమతి లేకుండా అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు హద్నూర ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. మండలంలోని గణేష్‌పూర్, న్యామతబాద్ గ్రామాల శివారులో అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు కొనసాగుతున్నాయి. తవ్విన ఎర్రరాళ్లను ట్రాక్టర్, లారీల్లో మండల పరిసర ప్రాంతాలతో పాటు కర్నాటక ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సరిహద్దు ఉస్సెళి చెక్‌పోస్టు వద్ద పోలీస్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఎర్రరాయి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

◆ ఫీజుల దోపిడీని అరికట్టాలి

సంగారెడ్డి టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రోజుకో స్కూల్ వెలుస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యా సంవత్సరం పూర్తి కాకముందే, నూతన విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో చేరాలని ప్రైవేట్ స్కూల్‌ల యాజమాన్యాలు తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ పాఠశాల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈఓ నాగరం శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. టీచర్లతో సమావేశం నిర్వహించారు. విద్యా బోధన అంశాలపై పలు సూచనలు చేశారు.

◆ యువత దేశభక్తి చాటాలి

కల్హేర్(నారాయణఖేడ్): యువత దేశభక్తిని చాటాలని హైందవ హిందూ ధర్మ ప్రచారకర్త అనుసుజారెడ్డి బాక్కి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మార్డిలో అఖండ హరినామ సప్తహాలో ప్రవచనం చేశారు. భగవద్గీత అనుసరించాలన్నారు. సాంఘిక దురాచారాలు రూపుమాపాలని కోరారు. శివాజీ మహరాజు, శంభాజీ చరిత్రను వివరించారు. తల్లిదండ్రుల బంధాలు, సమాజ తీరు మార్పు ప్రవచనాలతో అందరిని ఆకట్టుకున్నారు.

◆ చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రమౌళీశ్వరుడికి అభిషేకం, మహాహారతి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పురోహితులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

◆ వాహనం ఢీ.. మహిళలకు గాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. డివిజన్ పరిధిలోని గొల్ల బస్తీకి చెందిన సత్యమ్మ (43), పని నిమిత్తం ఈనెల 22న బయటకు వెళ్లి తిరిగి అర్ధరాత్రి ఇంటికి వస్తుండగా డివిజన్ పరిధిలోని పూజ ట్రేడర్స్ సమీపంలో నడుచుకుంటూ వస్తున్న సత్యమ్మను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయపడిన ఆమెను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరిగి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.